# సెంటిమెంట్

నేను డ్యూటీ మీద జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు వెళ్ళ వలసివచ్చింది. ఎలాగు వచ్చాం కదా! అని మా అక్కయ్యగారింటికి వెళ్ళాను.

"మామయ్యా! మామయ్యా!... నాదో చిన్న మాట" చనువుగా అడిగింది మా మేనకోడలు. ప్రశ్నార్థకంగా ఆమెను చూశాను.

"మీరు వాడుతూన్న పెన్ను ఇవ్వండి" అడిగింది.



"వచ్చే వారం మా ఫైనల్ డిగ్రీ ఎగ్జామ్. మీరిచ్చే కలంతో వ్రాస్తే నాకు ఫస్ట్ గ్యారంటీ. దట్స్ మై సెంటిమెంటు టూ!!"అమాయకంగా చేయి చాచింది. నా హస్తవాసి గురించి గుండె కొట్టు కుంటుంది. ఏం చెప్పాలో అర్థం కాలేదు. రాని చిరునవ్వు తెచ్చుకుని, తప్పని పరిస్థితుల్లో పెన్ను అందించాను.

రెండు నెలలు తిరగకుండానే మా మేనకోడలు నాకు లెటరు వ్రాసింది. లెటరు విప్పేసరికి గుండెల్లో రైళ్ళు సూపర్ స్పీడులా కొట్టుకుంటుంది.

"గౌరవనీయులైన మామయ్య గారికి నమస్కారములు,

నేను డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. అంతా మీ ఆశీర్వాద బలమే. మీరిచ్చిన కలంతో వ్రాశాను. మెనీ, మెనీ థాంక్సు" అని చదువుతూనే నా మనసు కుదుటపడింది. ఆనందంతో తరువాత వాక్యం చూశాను. "నాకు కాలేజీ ఫస్ట్ రావల్సింది కాని ఒన్ మార్కులో మిస్ అయింది" అని చదివేసరికి నా ముఖం పాలిపోయింది. అయితే తప్పు నాది కాదు అని మనసులో సరిపెట్టుకోవలసి వచ్చింది.

– బెహరా ఉమామహేశ్వరరావు

## మంచి తేనె

* ఓ రోజు రేలంగి తేనె అమ్మే దుకాణానికెళ్ళాడు. ఆ దుకాణంలో చూపిన తేనెను చూసి "ఏమయ్యా! ఈ తేనె మంచిదేనంటావా?" అనడిగాడు రేలంగి.

"మంచిదేనా ఏమిటి సార్... ఫస్ట్ క్లాస్ తేనెటీగల తేనెపట్టునుంచి ఈ రోజే తీశారు."

"అది సరేనయ్యా! ఆ తేనె టీగలు మంచివేనా అని" సీరియస్‌గా మళ్ళీ అడిగాడు రేలంగి.

– బద్దిగం



## భక్షకుడు

అడవిలో దారితప్పి తిరుగుతున్న జాన్సన్‌_కు ఓ ఆటవికుడు తారసపడ్డాడు. కొన్ని నిమిషాల సంభాషణ తర్వాత అతడు ఆటవికుడితో అడిగాడు.

"ఈ అడవిలో నరమాంస భక్షకులున్నారా?"

"ఆ ఒకడుండేవాడు. రెండ్రోజుల ముందు వాణ్ని నేనే తినేసాను" ....??

–మీర్ మహిది అలి, హైదరాబాద్

## ప్రేమ

'ప్రేమ' అనే రెండక్షరాలు ఎంతో మధురమైనవి. 'ప్రేమ' అనే సబ్జెక్ట్‌మీద బోలెడన్ని కథలు – నవలలు వచ్చాయి (వస్తున్నాయి). సినిమాలు కూడా చాలా వచ్చాయి. ఎన్ని వచ్చినా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అలాంటి ప్రేమకావ్యాన్ని 'లైలా మజ్ను' చిత్రాన్ని భానుమతిగారు డైరెక్ట్ చెయ్యబోతున్నారు. 1948లో భరణీ పిక్చర్స్ భానుమతి, నాగేశ్వరరావుతో 'లైలామజ్ను' నిర్మించింది. దాన్ని రామకృష్ణ డైరెక్ట్ చేశారు. మళ్లీ 44 సంవత్సరాల తరువాత భానుమతి భరణీ పిక్చర్స్ బ్యానర్‌పై నూతన నటీనటులతో 'లైలామజ్ను' నిర్మిస్తున్నారు. దీనికి స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం భానుమతిగారే. సంగీతం ఇళయరాజా. – మానస